ఖేలో ఇండియా మల్లఖంబ్ జాతీయ క్యాంప్‌కు వేముల యజ్ఞ ఎంపిక



దశ, పెద్ద అంబర్‌పేట్ : ఖేలో ఇండియా మల్లఖంబ్ జాతీయ క్యాంప్‌నకు కుంట్లూర్‌కు చెందిన విద్యార్థిని వేముల యజ్ఞ ఎంపికయ్యారు. మల్లఖంబ్ క్రీడలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి క్యాంప్‌నకు ఎంపిక కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యజ్ఞను అభినందిస్తూ, జాతీయ స్థాయిలో మరింత ప్రతిభ కనబరిచి క్రీడారంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించడం గర్వకారణమని పేర్కొన్నారు. యజ్ఞ ఈ స్థాయికి చేరుకోవడంలో నిరంతరం శిక్షణ అందించి ప్రోత్సహించిన కోచ్ నిలేష్ కృషిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు యజ్ఞకు శుభాకాంక్షలు తెలిపారు.


నర్సంపేటలో పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డికి ఘన స్వాగతం

పెద్ది సుదర్శన్ రెడ్డి ఆశయ సాధనే లక్ష్యం




దశ, నర్సంపేట: పట్టభద్రుల ఎమ్మెల్సీ సమీక్షా సమావేశం నిమిత్తం తొలిసారిగా నర్సంపేట పట్టణానికి విచ్చేసిన ఎమ్మెల్సీ ఇన్‌చార్జ్ పోచంపల్లిశ్రీనివాస్‌రెడ్డికిబీఆర్ఎస్ పార్టీనాయకులు,కార్యకర్తలుస్థానిక అయ్యప్ప దేవాలయం వద్ద ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన అయ్యప్ప స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. గత 25 ఏళ్లుగా ప్రతి సంవత్సరం అయ్యప్ప స్వామివారిని దర్శించుకుని ఆశీస్సులు తీసుకోవడం తనకు ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. స్వర్గీయ నేత పెద్ది సుదర్శన్ రెడ్డి ఆశయ సాధనే ధ్యేయంగా ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. ప్రతి సంవత్సరం డిసెంబర్ 9న నిర్వహించే సంప్రదాయ పంబా ఆరాట్ కార్యక్రమాన్ని మరింత ఘనంగా నిర్వహించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. స్థానిక అయ్యప్ప ఆలయ సమగ్ర అభివృద్ధికి తన వంతుగా పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. అయ్యప్ప స్వామివారి చల్లని ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్, అధ్యక్షులు, ఆలయ పాలక మండలి సభ్యులు, నియోజకవర్గ, పట్టణ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వినియోగదారుల మన్ననలు పొందాలి



దశ, సూర్యాపేట ప్రతినిధి : వినియోగదారుల మన్ననలు పొందుతూ వ్యాపార రంగంలో ముందుకు సాగాలని నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాధి అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శంకర్ విలాస్ సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన డ్రై ఫ్రూట్స్ హౌస్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూసూర్యాపేటలోనూతనంగావ్యాపారసంస్థనుప్రారంభించడం అభినందనీయమన్నారు. వ్యాపారులు నాణ్యమైన ఉత్పత్తులను అందిస్తూ వినియోగదారుల మన్ననలను పొందాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, దండు మైసమ్మ దేవాలయ చైర్మన్ తంగేళ్ల కర్ణాకర్ రెడ్డి, కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి, నాగుల వాసు, డ్రై ఫ్రూట్స్ హౌస్ నిర్వాహకులు పాషా, రవి సిబ్బంది రమేష్, తిరుపతమ్మ, శివ, కవిత, రాజేష్, శివారెడ్డి, స్వాతి, తరుణి తదితరులు పాల్గొన్నారు.



నాన్నంటే ఎన్నటికీ అర్థం కాని ఓ ఎమోషన్!



కన్నీళ్లు కనిపించని కష్టం.. మాటల్లో చెప్పలేని ప్రేమ..
జీవితాంతం పిల్లల కోసమే తపించే తండ్రి త్యాగం

నాన్నకు ప్రేమతో..

మనం ఈ భూమిపై జీవం పోసుకున్నామంటే అందుకు సూత్రధారులు అమ్మానాన్నలు. అమ్మ తొమ్మిది నెలలు కడుపులో మోస్తే.. నాన్న జీవితాంతం గుండెల్లో మోస్తాడు. అమ్మ కష్టాన్ని అందరూ గుర్తిస్తారు.. ఆమె ప్రేమను అందరూ కొనియాడుతారు. కానీ కుటుంబం కోసం నాన్న పడే శ్రమ, మనసులో దాచుకునే ఆవేదన గురించి మాట్లాడేవారు తక్కువే. తనకంటూ ఏ స్వార్థం లేకుండా, తన ఆశలను పక్కనపెట్టి పిల్లల కలలను నిజం చేయడానికి జీవితాన్నే ధారపోసే వ్యక్తి నాన్న. తనకు ఇష్టమైనవి వదులుకుని, పిల్లలకు కావాల్సినవన్నీ సమకూర్చాలని నిరంతరం తపిస్తాడు.

పగలు, రాత్రి.. ఎండ, వాన అనే తేడా లేకుండా కుటుంబం కోసం కష్టపడేది నాన్న. ఒంట్లో బాగాలేకపోయినా, ఒక్కరోజు పని మానేస్తే పిల్లల అవసరాలు తీరవేమోనన్న భయంతో పనికి వెళ్తాడు. తాను పస్తులున్నా పిల్లల కడుపు నిండాలని కోరుకుంటాడు. మగవారికి మనసు ఉండదా? వారికి బాధ కలగదా? కన్నీళ్లు రావా? తప్పకుండా వస్తాయి. కానీ తన బాధను కుటుంబానికి తెలియనివ్వకుండా గుండెల్లోనే దాచుకుంటాడు. బయటకు గంభీరంగా కనిపించినా.. లోపల మాత్రం కుటుంబం గురించే ఆలోచించే కోమలమైన మనసు నాన్నది.

నాన్న గట్టిగా మాట్లాడితే ప్రేమించడం తెలియదని అనుకుంటాం. మౌనంగా ఉంటే మనతో మాట్లాడటానికి ఇష్టపడటం లేదని భావిస్తాం. కానీ ఆ కోపం వెనుక మన భవిష్యత్తుపై ఆందోళన ఉంటుంది. ఆ మౌనం వెనుక ఎన్నో ఆశలు, ఆలోచనలు ఉంటాయి. పిల్లలు తప్పుదారి పట్టకూడదని, జీవితంలో ఎదురయ్యే కష్టాలను ధైర్యంగా ఎదుర్కోవాలని ఆయన కోరుకుంటాడు. అందుకే కొన్నిసార్లు కఠినంగా వ్యవహరిస్తాడు. నాన్న మనసు పూర్తిగా అర్థమయ్యేది మనం తల్లిదండ్రులమైనప్పుడే. ఆయన అంక్షల్లో ప్రేమను, హెచ్చరికల్లో ఆప్యాయతను, మౌనంలో బాధ్యతను అప్పుడు గుర్తించగలుగుతాం. కొడుకు తనకంటే పది అడుగులు ఎత్తుకు ఎదగాలని కోరుకునేది నాన్న. తాను సాధించలేని విజయాలను తన కొడుకు సాధిస్తే అంతకంటే గొప్ప ఆనందం ఆయనకు మరొకటి ఉండదు. తనకంటే ఉన్నత స్థాయికి ఎదిగిన కొడుకును చూసి అందరికంటే ఎక్కువగా గర్వపడతాడు. కూతురి విషయానికి వస్తే ఆమెకు నాన్నే మొదటి హీరో. ఆమె కలలు నెరవేరాలని, జీవితంలో ఎలాంటి కష్టం వచ్చినా ధైర్యంగా ఎదుర్కోవాలని కోరుకుంటాడు. పిల్లలిద్దరూ సంతోషంగా, గౌరవంగా జీవించాలన్నదే నాన్న జీవితకాలపు కల. ప్రపంచమంతా మనకు వ్యతిరేకంగా నిలిచినా, మన వెనుక అండగా నిలిచే వ్యక్తి నాన్న. మనం ఓడిపోయినప్పుడు ధైర్యం చెప్పేవాడు.. గెలిచినప్పుడు అందరికంటే ఎక్కువగా గర్వపడేవాడు ఆయనే. పిల్లలు తనకు దూరంగా ఉన్నా, తమ జీవితాల్లో బిజీగా ఉన్నా వారు సుఖసంతోషాలతో, ఆరోగ్యంగా ఉండాలని మనసులో కోరుకుంటూనే ఉంటాడు. పిల్లలు తమ బాధ్యతలను మరిచిపోయినా, తండ్రి ఆశలను పట్టించుకోకపోయినా ఆయన ప్రేమ తగ్గదు. వారు ఎక్కడున్నా బాగుండాలని కోరుకునే నాన్న మనసుకు కొలమానం లేదు.

అమ్మ ఆరాటాన్ని కన్నీళ్లు చెబుతాయి.. నాన్న ఆత్రుతను ఆయన కళ్లు మాత్రమే తెలియజేస్తాయి. అమ్మ ప్రేమను మాటల్లో వ్యక్తపరిస్తే.. నాన్న ప్రేమను బాధ్యతల్లో చూపిస్తాడు. అమ్మ పిల్లల ఆకలి తీరిస్తే.. నాన్న వారి ఆశలు తీర్చేందుకు శ్రమిస్తాడు. అమ్మ పిల్లల సుఖం కోసం ఆలోచిస్తే.. నాన్న వారి భవిష్యత్తు, భద్రత కోసం ఆవేదన చెందుతాడు. అమ్మ సేవ చేస్తే.. నాన్న సరిదిద్దుతాడు. అమ్మ ప్రేమ అనుక్షణం కనిపిస్తే.. నాన్న ఆశీర్వాదం ప్రతి క్షణం కనిపించకుండా వెన్నంటే ఉంటుంది. నాన్న రుణం తీర్చుకోవడానికి పెద్ద బహుమతులు అవసరం లేదు. ఆయన కష్టాన్ని గుర్తించడం, ఆప్యాయంగా పలకరించడం, వృద్ధాప్యంలో అండగా నిలవడం చాలు. ప్రత్యేకమైన రోజుల్లోనే కాదు.. ప్రతిరోజూ నాన్న గొప్పతనాన్ని గుర్తుచేసుకోవాలి.

నాన్నా.. మా ప్రతి అడుగు వెనుక మీ కష్టం ఉంది. మా ప్రతి విజయం వెనుక మీ త్యాగం ఉంది.
మీ రుణం తీర్చుకోవడానికి మా జీవితకాలం కూడా సరిపోదు. మీరు మా వెనుక ఉన్నారనే
నమ్మకమే మాకు కొండంత బలం. మీకు మా హృదయపూర్వక ప్రేమాభివందనాలు!

సంపాదకులు: జ్వాలా దశ

ప్రత్యేక కథనం..

ఎమ్మెల్సీ ఓటరు నమోదు పత్రాలపై నిశిత పరిశీలన



- *బోగస్ ధ్రువపత్రాలు సమర్పిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయాలి: రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి*

దశ, రంగారెడ్డి : మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. నకిలీ డిగ్రీ సర్టిఫికెట్లు, బోగస్ ధ్రువపత్రాలు సమర్పించి ఓటరు నమోదుకు ప్రయత్నించినట్లు గుర్తిస్తే సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని స్పష్టం చేశారు. గురువారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి. నారాయణ రెడ్డితో కలిసి ఆయన రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయం, శంషాబాద్ మున్సిపల్ కార్యాలయాలను సందర్శించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు దరఖాస్తుదారులు సమర్పించిన ఫారం 18లు, డిగ్రీ సర్టిఫికెట్లు, ఇతర విద్యార్హత ధ్రువపత్రాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి దరఖాస్తులోని వివరాలు, జత చేసిన ధ్రువపత్రాల ప్రామాణికతను నిర్ధారించాలని రాజేంద్రనగర్ ఆర్డీఓ, రాజేంద్రనగర్, శంషాబాద్ తహసీల్దార్లు, శంషాబాద్ మున్సిపల్ డిప్యూటీ కమిషనర్‌ను ఆదేశించారు. పత్రాలు నిజమైనవా, సంబంధిత దరఖాస్తుదారులకు చెందినవా అనే అంశాలను ధ్రువీకరించాలని సూచించారు.

దరఖాస్తుల్లోని వివరాలకు, విద్యార్హత ధ్రువపత్రాలకు మధ్య వ్యత్యాసాలు కనిపిస్తే వాటిని గుర్తించి అవసరమైన విచారణ చేపట్టాలన్నారు. ఓటరు నమోదు ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా జరిగేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సుదర్శన్‌రెడ్డి స్పష్టం చేశారు. ధ్రువపత్రాల పరిశీలనలో నిర్లక్ష్యం వహించవద్దని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ పర్యటనలో రాజేంద్రనగర్ ఆర్డీఓ శ్రీధర్, తహసీల్దార్ రాములు, శంషాబాద్ మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ సుమన్ రావు, శంషాబాద్ తహసీల్దార్ అమరలింగం, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఐలు రామన్నపేట కోర్టు కమిటీ అధ్యక్షుడిగా యాదాసు యాదయ్య ఎన్నిక



దశ, రామన్నపేట: ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) రామన్నపేట కోర్టు కమిటీ అధ్యక్షుడిగా అడ్వకేట్ యాదాసు యాదయ్య ఎన్నికయ్యారు. రామన్నపేట కోర్టు కాంప్లెక్స్‌లో నిన్న నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ గౌరవ అధ్యక్షుడిగా పాల్వంచ జగతయ్య, ఉపాధ్యక్షుడిగా అంకం నరేష్, ప్రధాన కార్యదర్శిగా గడ్డం నరసింహ ఎన్నికయ్యారు. సభ్యులుగా జితేందర్, తాటిపాముల కిరణ్ కుమార్, బాలరాజును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు యాదాసు యాదయ్య మాట్లాడుతూ.. రాజ్యాంగ ఆశయాల సాధనకు ఐలు కృషి చేస్తుందని, న్యాయవాదుల సంక్షేమంతో పాటు రాజ్యాంగం, న్యాయవ్యవస్థ పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. ఈ నెల 31న భువనగిరిలోని న్యూ వివేరాలో నిర్వహించనున్న ఐలు జిల్లా రెండో మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా చంద్రకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొననున్నారని, 'రాజ్యాంగ పరిరక్షణలో న్యాయవాదుల పాత్ర' అనే అంశంపై సెమినార్ నిర్వహించనున్నట్లు తెలిపారు.




ఆహారంతోనే ఆరోగ్య పరిరక్షణ

ఘనంగా లక్ష్మణ్ ఆరోగ్యగ్రామం ప్రథమ వార్షికోత్సవం

దశ, హైదరాబాద్ : ఆరోగ్యకరమైన ఆహారం, సహజ జీవన విధానంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. లక్ష్మణ్ పూడి స్థాపించిన లక్ష్మణ్ ఆరోగ్యగ్రామం ప్రథమ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ.. నేటి సమాజంలో ఆహార కల్తీ ఆందోళన కలిగిస్తోందన్నారు. పలు హోటళ్లు, రెస్టారెంట్లు ఆహార భద్రత ప్రమాణాలను పాటించకపోవడం ప్రజారోగ్యానికి ముప్పుగా మారిందన్నారు. భావితరాలకు ఆస్తిపాస్తుల కంటే స్వచ్ఛమైన నీరు, కల్తీలేని ఆహారం అందించడం ముఖ్యమన్నారు. ముఖ్యంగా యువత పోషకాహారం, పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛమైన తాగునీటి వినియోగంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. లక్ష్మణ్ ఆరోగ్యగ్రామం వ్యవస్థాపకుడు లక్ష్మణ్ పూడి మాట్లాడుతూ.. పోషకాహారం, ప్రకృతి వ్యవసాయం, ఆరోగ్యకరమైన జీవనశైలిపై ప్రజలకు అవగాహన కల్పించడమే తమ లక్ష్యమన్నారు. వ్యాధుల నివారణకు అవసరమైన ఆహారపు అలవాట్లను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, ప్రజాగాయని అరుణోదయ విమలక్క, సుమన్ టీవీ వ్యవస్థాపకుడు సుమన్ దూది, సినీ నటులు సప్తగిరి, కిరాక్ ఆర్పీ, ఫైట్ మాస్టర్లు రామ్-లక్ష్మణ్, సంగీత దర్శకుడు వందేమాతరం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా 2కే రన్



దశ, రామన్నపేట: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిర్మూలన, సైబర్ నేరాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రామన్నపేటలో 2కే రన్ నిర్వహించడం జరిగింది. గురువారం ఉదయం 6 గంటలకు రామన్నపేటలోని సుభాష్ చంద్రబోస్ విగ్రహం నుండి, జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్, ఐపీఎస్ ఆధ్వర్యంలో పరుగును, ప్రారంభించారు,ఈ కార్యక్రమం ద్వారా యువత, ప్రజల్లో మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు, సైబర్ మోసాల అప్రమత్తంగా ఉండాలని, డ్రగ్స్ నియంత్రణ పాటించాలని, పలు అంశాలపై చైతన్యపరిచారు. మత్తుకు దూరంగా ఉండండి,మానవత్వంతో ముందుకు సాగండి, సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండి వ్యక్తిగత సమాచారాన్నికాపాడుకోవాలనిపోలీసులు సందేశం ఇచ్చారు, ఆరోగ్యమే లక్ష్యంగా, అవగాహననే ఆయుధంగా చేసుకొని మత్తు రహిత, సైబర్ నేరాలు లేని సురక్షిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని, ఈ సందర్భంగాపిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు రామన్నపేట సిఐ ఎం రవి, రామన్నపేట ఎస్సై గోపాతి సతీష్, వలిగొండ ఎస్సై శ్రీకాంత్ రెడ్డి, ఆత్మకూర్ ఎం ఎస్ ఐ లక్ష్మీనారాయణ ,మోత్కూర్ ఎస్సై సతీష్, అడ్డగూడూరు ఎస్సై వెంకట్ రెడ్డి, రామన్నపేట ఏఎస్ఐ సురేందర్ ,హెడ్ కానిస్టేబుల్ కమలాకర్, వెంకటేశ్వర్లు, పోలీస్ సిబ్బంది లింగస్వామి ,స్వామి నాయక్, ప్రవీణ్, ప్రశాంత్, స్వామి, మధు, కృష్ణమూర్తి ,నరసింహ, లావణ్య, కవిత, సైదులు సైదయ్య ,కళాశాల విద్యార్థిని విద్యార్థులు ,స్థానిక స్వచ్ఛంద సేవ సంస్థ నిర్వాహకులు, రాజకీయ నాయకులు, తదితరులు, పాల్గొన్నారు.

పిల్లల స్నేహపూర్వక జిల్లాగా సూర్యాపేట





- యూనిసెఫ్‌తో జిల్లా యంత్రాంగం అవగాహన ఒప్పందం
- క్షేత్రస్థాయి సిబ్బందికి ప్రత్యేక శిక్షణ

దశ, సూర్యాపేట ప్రతినిధి : సూర్యాపేట జిల్లాను బాలల స్నేహపూర్వక జిల్లాగా తీర్చిదిద్దే లక్ష్యంతో జిల్లా యంత్రాంగం ముందడుగు వేసింది. పిల్లల హక్కుల పరిరక్షణ, వారి స్వేచ్ఛ, అభిరుచులు, ఆలోచనా విధానంపై అవగాహన కల్పించేందుకు యూనిసెఫ్‌తో జిల్లా యంత్రాంగం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ నరసింహ, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారుల సమక్షంలో ఈ ఒప్పందం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ వార్డు అధికారులు, విద్యాశాఖ క్లస్టర్, గ్రామస్థాయి రిసోర్స్ పర్సన్లు, అంగన్‌వాడీ టీచర్లు, సూపర్‌వైజర్లకు ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. పిల్లల హక్కులు, మానసిక వికాసం, వారి ఆలోచనా సరళి, సమస్యలను గుర్తించడం, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై శిక్షణలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి అధికారి పిల్లల సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. బాలలు తమ హక్కులను, స్వేచ్ఛను పూర్తిస్థాయిలో అనుభవించేలా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పిల్లల్లోని నైపుణ్యాలు, అభిరుచులను గుర్తించి, వారు స్వచ్ఛందంగా తమ ప్రతిభను ప్రదర్శించేలా ప్రోత్సహించాలని ఆదేశించారు. ఈ శిక్షణ సూర్యాపేటను బాలల స్నేహపూర్వక జిల్లాగా తీర్చిదిద్దేందుకు దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యూనిసెఫ్ ప్రతినిధి ఫిలిప్స్, జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు, జిల్లా రెవెన్యూ అధికారి ప్రేమ్‌రాజ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు రవితేజ, అనుష, జిల్లా బాలల పరిరక్షణ అధికారి బి. రవికుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉపేంద్ర, వివిధ ప్రాజెక్టుల సీడీపీవోలు, సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదు తప్పనిసరి

ఎమ్మెస్ విద్యాసంస్థల చైర్మన్ పందిరి నాగిరెడ్డి



దశ, మునగాల: త్వరలో జరగనున్న నల్లగొండ, ఖమ్మం ,వరంగల్ పట్టాభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా, 2023 నాటికి డిగ్రీ పూర్తి చేసిన పట్టభద్రులు ప్రతి ఒక్కరు ఎమ్మెల్సీ ఓటరుగా దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెస్ విద్యాసంస్థల చైర్మన్, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు పందిరి నాగిరెడ్డి కోరారు. గురువారం మండల పరిధిలోని ముకుందాపురం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు తన విద్యాసంస్థల ఆధ్వర్యంలో రూపొందించిన ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ నమోదు కరపత్రాలను పంపిణీ చేస్తూ 2027 వ సంవత్సరంలో జరిగే యం ఎల్ సి ఎన్నికలలో గ్రాడ్యుయేట్ లు ప్రతి ఒక్కరూ తమ ఓటు నమోదు చేసుకోవాలని ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలోజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు యం.శోభన్ బాబు, ఉపాధ్యాయులు జీవి,చంద్రకళ, రామ్మూర్తి, మమత, మధు, హేమలత, బాలస్వామి,కృష్ణ మరియు కోదాడ యం యస్ విద్యా సంస్థల సీ ఈ వో యస్ యస్ రావు లు పాల్గొన్నారు.

ఆదర్శ రైతుగా మూల వెంకటరెడ్డి ఎంపిక



దశ, మునగాల: మండల పరిధిలోని నారాయణ గూడెం గ్రామానికి చెందిన రైతు మూల వెంకటరెడ్డినీ, వైస్ టీవీ డిజిటల్, వారు కిషన్ మహారాజా 2026 అవార్డ్స్ ప్రధాన ఉత్సవంలో భాగంగా జిల్లా ఆదర్శ రైతుగా ఎంపిక చేశారు. గురువారం హైదరాబాద్ హైటెక్ సిటీలోని శిల్పకళా వేదికలో వైస్ టీవీ డిజిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కిషన్ మహారాజా 2026 అవార్డ్స్ వేడుకల కార్యక్రమం ఘనంగా నిర్వహించగా,రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల వారీగా ఎంపిక చేసిన ఆదర్శ రైతుల అవార్డులు ప్రధాన్సోవ కార్యక్రమ వేడుక ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మండల పరిధిలోని నారాయణగూడెం గ్రామానికి చెందిన ఆదర్శ రైతు మూల వెంకటరెడ్డినీ సూర్యాపేట జిల్లా ఆదర్శ రైతుగా ప్రకటిస్తూ,ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి, వైస్ టీవీ యాంకర్ రాములమ్మ చేతుల మీదుగా అవార్డు అందజేసి పూలమాల శాలువాతో ఘనంగా సన్మానించారు. వ్యవసాయ రంగంలో ఆయన చేస్తున్న కృషి, ఆధునిక పద్ధతులను అవలంబిస్తూ ఇతర రైతులకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. అదేవిధంగా గ్రామస్తులు, రైతులు, బంధుమిత్రులు వెంకటరెడ్డి అవార్డు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

ఆశ్రమ పాఠశాలల్లో డీడీ ఆకస్మిక తనిఖీలు

పదో తరగతి వంద రోజుల ప్రణాళికపై సమీక్ష



దశ, ఆసిఫాబాద్: ఆసిఫాబాద్‌లోని గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల, ఆదర్శ క్రీడా పాఠశాలను గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలు, పదో తరగతి వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలుపై సమీక్ష నిర్వహించారు. విద్యార్థుల విద్యా పురోగతిని పరిశీలించిన ఆయన, పదో తరగతి ఫలితాల మెరుగుదలకు నిర్దేశిత కార్యాచరణను పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన బాలికలను డిప్యూటీ డైరెక్టర్ అభినందించారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ప్రోత్సహించారు. ఈ తనిఖీల్లో జిల్లా క్రీడల అధికారి మడావి శేకు ఆయన వెంట ఉన్నారు.

విష పూరిత గడ్డితిని 13 గొర్రెలు మృతి



దశ, మునగాల: విషపూరిత గడ్డితిని 13 గొర్రెలు మృతిచెందగా 25 గొర్రెలు అనారోగ్యానికి గురైన సంఘటన మండల పరిధిలోని మాధవరం గ్రామ శివారులో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, మండల పరిధిలోని మాధవరం గ్రామ సమీపంలోని 65వ నెంబర్ జాతీయ రహదారి వెంట గంగమ్మ గుడి సమీపంలో స్థానిక గొర్రెల కాపరులు తమ గొర్రెలను మేపుతుండగా, అకస్మాత్తుగా కొన్నిగొర్రెలు వణుకుతూ మెడ, కాళ్ల భాగంలో నరాలు గడ్డు కట్టకపోయి, కడుపు ఉబ్బరంతో 13 గొర్రెలు అక్కడికక్కడే చనిపోయాయి. మిగతా గొర్రెలు కూడా అస్తవ్యస్తతకు గురైకిందపడిపోగా స్థానికులు మరియు గొర్రెల కాపరులు పశువైద్య అధికారిని సంప్రదించగా, మునగాల మండల పశువైద్యాధికారి భాస్కర్, గోపాలమిత్రాలు సతీష్, సురేష్ లు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని, అనారోగ్యానికి గురైన 25 గొర్రెలకు చికిత్స అందించగా, వాటి ఆరోగ్య స్థితి మెరుగైనది.

కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి





- బీజేపీ నాయకులకు ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ పిలుపు

దశ, ఓయూ: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనను విస్మరించి, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తోందని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ విమర్శించారు. అత్యున్నత న్యాయస్థానం నిర్ణయాలను విస్మరిస్తూ అధికార మదంతో వ్యవహరిస్తున్న ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. నవంబర్ 2న హైదరాబాద్‌లో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పాల్గొననున్న పాదయాత్రను విజయవంతం చేయాలని కోరుతూ హెచ్ఎంటీ నగర్ డివిజన్ బీజేపీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలకు నిరసనగా ట్యాంక్‌బండ్‌పై నిర్వహించనున్న పాదయాత్రకు హెచ్ఎంటీ నగర్ డివిజన్ నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డును తొలగించాలని డిమాండ్ చేస్తూ మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ చేపట్టనున్న పాదయాత్ర ముగింపు బహిరంగ సభను కూడా విజయవంతం చేయాలని సూచించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై ప్రతి కార్యకర్త ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రభాకర్ కోరారు. బంధువులు, మిత్రుల్లో అర్హులైన పట్టభద్రులను గుర్తించి ఓటర్లుగా నమోదు చేయించాలని, రెండు ఎమ్మెల్సీ స్థానాలను గెలుచుకునే లక్ష్యంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు చంద్రమౌళి, కార్మిక విభాగం జిల్లా కన్వీనర్ యోగేశ్వర్ రెడ్డి, రాజిరెడ్డి, మోర నర్సింహారెడ్డి, చిల్లా అశోక్, గందమల గోపి, కిరణ్‌కుమార్, రమేష్, వేణుగోపాల్, సురేందర్ స్వామి, శేఖర్ గుప్తా, ఉప్పలయ్య, బాలరాజ్, క్రాంతికుమార్, కిషోర్, సాగర్, మంజులవాణి, పార్వతి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సూర్యాపేట 35వ వార్డులో అభివృద్ధి పనులకు శ్రీకారం



దశ, సూర్యాపేట ప్రతినిధి : పట్టణంలోని వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాధి అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 35వ వార్డులో కౌన్సిలర్ జ్యోతి శ్రీవిద్య కరుణాకర్ ఆధ్వర్యంలో మున్సిపల్ జనరల్ ఫండ్ నుంచి రూ.5 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ లైన్ నిర్మాణ పనులకు వారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలకు మెరుగైన రహదారులు, డ్రైనేజీ వ్యవస్థతో పాటు అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యమన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతూ మెరుగైన జీవన సౌకర్యాలు అందించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు భాస్కర్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ షఫీ ఉల్లా, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వెలుగు వెంకన్న, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, మున్సిపల్ కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వైద్య సేవల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు



దశ, భద్రాద్రి కొత్తగూడెం: గ్రామీణ,పట్టణప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలు చేయాలని డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ప్రతాప్ సూచించారు. గురువారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించిన ఆయన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రత్యేక వార్డులు, వ్యాక్సినేషన్ సెషన్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు.పర్యటనలో భాగంగా పాలకొయ తండా, నవభారత్ ప్రాంతాల్లో రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్బీఎస్‌కే) ఆధ్వర్యంలో చిన్నారులకు నిర్వహిస్తున్న కంటి పరీక్షల శిబిరాలను పరిశీలించారు. చిన్నారుల్లో దృష్టి లోపాలను ప్రాథమిక దశలోనే గుర్తించడం ద్వారా శాశ్వత అంధత్వాన్ని నివారించవచ్చని తెలిపారు. కంటి సమస్యలున్న పిల్లలను వెంటనే ఉన్నత ఆసుపత్రులకు రిఫర్ చేసి ఉచిత వైద్యం అందేలా చూడాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు.అనంతరం బీడీకే చిట్టిరామవరం కేంద్రాన్ని సందర్శించి ఓపీ, ఐపీ సేవలు, మందుల నిల్వలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కేంద్రం సేవలపై ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రజారోగ్య సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని, ఫిర్యాదులు పునరావృతం కాకుండా పారదర్శకంగా విధులు నిర్వహించాలని హెచ్చరించారు.రామవరం మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన డాక్టర్ ప్రతాప్, డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్, నవజాత శిశు సంరక్షణ విభాగం, జీరో డోస్ వ్యాక్సినేషన్ గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. పుట్టుకతో వచ్చే లోపాలున్న చిన్నారులకు సకాలంలో చికిత్స అందించాలని, నవజాత శిశువుల సంరక్షణలో అప్రమత్తంగా ఉండాలని వైద్యులకు సూచించారు. ఇప్పటివరకు ఒక్క టీకా కూడా తీసుకోని పిల్లలను గుర్తించి జీరో డోస్ టీకాలు వేయాలని ఆదేశించారు.

బాలల రక్షణపై అవగాహన కలిగి ఉండాలి



దశ, మణుగూరు: చిన్నారుల భద్రత, రక్షణ విషయంలో సమాజంలోని ప్రతి ఒక్కరూ పూర్తి అవగాహన కలిగి ఉండాలని, బాలల హక్కుల పరిరక్షణలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్థానిక మెజిస్ట్రేట్ కంబపు సూరి రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం సల్సా ఆదేశాల మేరకు 'సురక్షిత్ బచ్పన్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా మణుగూరు రాజీవ్ గాంధీ నగర్‌లోని రాధిక కాన్సెప్ట్ పాఠశాలలో పోక్సో చట్టం-2012పై ప్రత్యేక న్యాయ చైతన్య సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన మెజిస్ట్రేట్ కంబపు సూరి రెడ్డి మాట్లాడుతూ.. బాలలపై జరుగుతున్న లైంగిక వేధింపులు, దాడులను అరికట్టేందుకు చట్టాలు కఠినంగా ఉన్నాయని, వాటిపై విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు సరైన అవగాహన ఉండాలని స్పష్టం చేశారు. పాఠశాల దశ నుంచే విద్యార్థులకు 'మంచి స్పర్శ - చెడు స్పర్శ' పై స్పష్టమైన జ్ఞానాన్ని అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. చిన్నారులు తమకు ఎదురయ్యే ఎలాంటి అనుమానాస్పద పరిస్థితులు, ఇబ్బందులనైనా తల్లిదండ్రులు లేదా ఉపాధ్యాయులకు నిర్భయంగా తెలియజేసే విధంగా స్నేహపూర్వక వాతావరణాన్ని కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మణుగూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురుకృష్ణ, సీనియర్ న్యాయవాదులు కె. నరసింహారావు, లీగల్ ఎయిడ్ కౌన్సెల్ పి. పద్మావతి, ఎ. సర్వేశ్వరరావు, ఎం. వాసవి, పాఠశాల చైర్మన్ జి. మధుసూదన్ రెడ్డి, ప్రిన్సిపాల్ నరేష్, కోర్టు సిబ్బంది, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు పాల్గొన్నారు.